# బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు

**నిత్యం కుక్కకాటుకు గురౌతున్న ప్రజలు**


తూబాడు గ్రామంలో వీధికుక్కలు

**నాదెండ్ల:** గ్రామసింహాలు బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య అమితంగా పెరిగిపోయి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా తూబాడు గ్రామంలో శనివారం వీధికుక్కలు కరవటంతో ఇరువురు ఆసుపత్రి పాలయ్యారు. నాదెండ్ల, గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి నిత్యం నలుగురు వరకూ కుక్కకాటుకు గురై చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు వస్తున్నారు. చిన్నారులు, స్కూలుకు వెళ్ళే విద్యార్థులు కుక్కల బెడదకు భయభ్రాంతులకు గురౌతున్నారు. మేజర్ పంచాయతీ గణపవరంలో గడిచిన కొద్దినెలల కాలంలోనే గేదెల పాకాల్లో ఉన్న లేగదూడలు, గొర్రెలు, మేకలను చంపి పీక్కుతిన్న సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. దీంతో పశుపోషకులు నష్టపోతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో వీధి కుక్కల సంఖ్య పెరుగుతోంది. రాత్రిపగలు తేడా లేకుండా పాదచారులు, వాహనాలపై వెళ్ళే వారిని వెంటపడికరుస్తున్నాయి. కుక్కలకు సంతాన నియంత్రణ చికిత్సలు చేసి వాటి సంఖ్యను నియంత్రించాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు.

## బస్సులు నిలపండి సార్...!



శావల్యాపురంలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నిలుపుదల చేయడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం అమలు అవుతున్నప్పటి నుంచి ఇక్కడ బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మండల కేంద్రం మీదుగా వెళ్లే బస్సులు వినుకొండ ఆర్టీసీ బస్టాండులోనే ప్రయాణికులతో బస్సులు నిండిపోతున్నా యి. దీంతో ఇక్కడ బస్సులు ఆగకుండా వెళుతున్నాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమై ప్రయాణం సాగించాల్సి వస్తే బస్సులు ఖాళీ లేక.. వస్తున్నవి ఆపకుండా వెళ్లిపోతుండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

–శావల్యాపురం

## క్లుప్తంగా

### నేడు అమృత మంజరి ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ



**వినుకొండ:** మను జ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట రోడ్డులోని కేజీఎల్ కల్యాణమండపంలో అమృత మంజరి ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

### రైతులు పంట నమోదు చేసుకోవాలి

**వినుకొండ :** మండల పరిధిలోని రైతులు తమ పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి శనివారం తెలిపారు. కౌలు రైతులు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందికి అర్జీ అందజేసి వీఆర్వో ద్వారా కౌలు రైతు కార్డు పొంది సంబంధిత సర్వే నంబర్లు వేసి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాల్సిందిగా తెలిపారు. తద్వారా సెంటు భూమిలేని ఓసీ రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.

### రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



**వినుకొండ:** పట్టణంలోని పలు రేషన్‌షాపుల్లో రెవెన్యూ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రేషన్‌డీలర్లు సమయపాలన పాటించడం లేదని, కార్డుదారులకు బియ్యంకు బదులుగా డబ్బులు ఇస్తున్నారని తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ సురేష్, డీటీ మురళి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఈ–పాస్ మిషన్‌లో ఉన్న ప్రకారం నిల్వలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డీలర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, సమయపాలన ప్రకారం రేషన్‌దుకాణాలు తెరిచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని, బియ్యం బదులు డబ్బులు ఇస్తామంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### విజయవంతంగా ముగిసిన వేడుకలు

**శావల్యాపురం:** మండల కేంద్రంలోని నిదానంపాటి అమ్మవారి దేవాలయంలో దసరా వేడుకలు గ్రామస్తులు దాతలు సహకారంతో ఘనంగా పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు కొర్నేమల్లి సాంబశివరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయంలో ప్రత్యేకంగా దుర్గమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆలయ పూజారి శ్రీనివాసరావు–శ్రీదేవి దంపతులు, ఫకీరుయోగి సారథ్యంలో 11 రోజుల పాటు కుంకుమ పూజలు, అర్చనలు అభిషేకాలు హోమాల దంపతులచే ప్రత్యేక పూజల నిర్వహించామని వివరించారు. చివరిరోజు భారీ అన్నదాన కార్యక్రమంతో పాటు సాయంత్రం ట్రాక్టరుపై గ్రామపురవీధుల్లో కోలాటం డప్పుల విన్యాసాల ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని నిమజ్జన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఆలయ ధర్మకర్తలు మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేశ్‌లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు దాతలు సహకారం వల్లనే ఈ వేడుకలు విజయతంవంతంగా జరిగిమన్నారు. ఈకార్యక్రమంలో నరిసిరెడ్డి, రావులపాటి పున్నారెడ్డి, కొండారెడ్డి, లింగాల శ్రీహరి పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లకు మేలు



**చిలకలూరిపేట:** ఆటోడ్రైవర్లకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని ఆటో డ్రైవర్ల సమక్షంలో శనివారం ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో 1129 మందికి గాను రూ.1,69,35,000 అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేద్యంపై రైతుల్లో అవగాహన కల్పించాలి

**జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి**


మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

**నరసరావుపేట రూరల్:** ప్రకృతి సేద్యంపై రైతుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని రైతుల్లోకి తీసుకెళ్లే బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. 2025–26 సంవత్సరానికి 82,619 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు వదిలి దేశీయ కషాయాల వాడటం వలన భూమి ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. దీని వలన ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ప్రధాన పంటలతో పాటు అంతర పంటలతో పాటు, పంటరక్షణ కోసం చుట్టూ జొన్న, సజ్జ వంటి గోడ పంటలను నాటాలని సూచించారు. పంటలపై క్రిమిసంహారకాలు, రసాయన ఎరువులు వావడకుండా ఆవు మూత్రం, పేడతో తయారు చేసిన కషాయాలు వాడటం వలన దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం ప్రకృతి పద్ధతిలో సాగు చేస్తున్న వరి, మిరప, పెసలు, కంది వంటి పంటల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించేందుకు నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి డివిజన్‌లకు చెందిన 16మందికి కిట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజ్, జిల్లా ఎన్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, మేరి, సౌజన్యలు పాల్గొన్నారు.

### పెన్షనర్స్ భవన్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



**నరసరావుపేట ఈస్ట్:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ పల్నాడుజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్ల భవన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి వైద్య బృందం శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డులు ఉన్నవారికి ఉచితంగా అన్నిరకాల కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కె ప్రసాదు, పూజల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### మెగా జాబ్‌మేళా

**వినుకొండ :** మండలంలోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాలలో ఈనెల 6వ తేదీన ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ శనివారం తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో జోసిల్, అమర రాజా బ్యాటరీస్, దీవిస్ లేబరేటరీస్, పెప్సీ కోలా వంటి 20 కంపెనీల వారు పాల్గొనున్నట్లు తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన 18–30 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ మెగా జాబ్‌మేళాకి హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలను 9440542030, 8465819546, 7702892288 నంబర్లను సంప్రదించాలన్నారు.

### ఉత్సవంగా అమ్మవారి నిమజ్జనం



**నాదెండ్ల:** గణపవరం శాంతినగర్ కాళీయూత్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని చలువ పందిరిలో ఏర్పాటు చేసిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ బద్ధ మేళతాళాలతో అమ్మవారిని ఊరేగింపుగా గ్రామంలోని కుప్పగంజివాగులో నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా కేరళ కళాకారులచే నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గత నెల 22 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ వివిధ అలంకారాల్లో పూజలందుకున్న అమ్మవారి నిమజ్జనంతో ఉత్సవాలు ముగిశాయి. కమిటీ సభ్యులు భారీ అన్నదానం నిర్వహించారు.

### ఇద్దరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

**యడ్లపాడు:** కులం పేరుతో దూషించాడని గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం యడ్లపాడు మండలం జాలాది గ్రామ పంచాయతీ సర్పంచ్ కూరాకుల బాబును ఈ నెల ఒకటో తేదీన గ్రామానికి చెందిన మానం శంకరరావు, జరుగుల సాంబశివరావు తనను కులం పేరుతో దూషించాడని యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండవ తేదీ నరసరావుపేట డీఎస్పీ క్షేత్రస్థాయిలో విచారణ చేశారని వివరించారు. ఈ మేరకు ఇద్దరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.శివరామకృష్ణ తెలిపారు.

## సాగర్‌బాబు కుటుంబానికి న్యాయం చేయాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**శావల్యాపురం:** విద్యుత్ అధికారుల నిర్లక్షంతో వికలాంగుడిగా మారిన వర్ల సాగర్‌బాబు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ ప్రజాసంఘాల నాయకులు తహసీల్దారు ఎం.అర్జున్‌నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కలుపుకూరి ఏసురత్నం మాట్లాడుతూ కారంపూడి మండలం కాకానివారిపాలెం గ్రామానికి చెందిన వర్ల సాగర్‌బాబు విద్యుత్ మీటర్ల రీడింగ్ పనులు చేస్తూ జీవనం సాగించాడన్నారు. మండల పరిధిలోని విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభం ఎక్కించి ఎల్‌సీ తీసుకోకుండా నిర్లక్ష్యంగా విద్యుత్ పనులు చేయిస్తుండగా విద్యుత్ షాకుకు గురై స్తంభంపై నుంచి కిందపడి వెన్నుపూస విరిగిపోయి మంచానికి పరిమితం అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో విద్యుత్ అధికారులు బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోకుండా నిర్లక్షం చేయటంతో పలుమార్లు రీలే నిరహార దీక్షలు విద్యుత్ అధికారులకు అర్జీలు ఇచ్చినప్పటికీ నేటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా ఆర్థిక చేయూతతో పాటు నిర్లక్ష్యం వహించిన విద్యుత్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తగిన న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసన తెలియజేస్తామన్నారు, వినతి పత్రం అందజేసిన వారిలో కె.వి.ప్రసాదురావు, కట్టెంపూడి డేవిడ్, రెడ్డిబోయిన ప్రసన్న, రైతు సంఘం నాయకులు గణపర్తి వెంకటేశ్వర్లు, వై.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## సజావుగా అంగన్‌వాడీల ఇంటర్వ్యూలు


ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో వేచిఉన్న మహిళలు

**సత్తెనపల్లి:** పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని తొమ్మిది అంగన్‌వాడీ వర్కర్లు, 29 హెల్పర్ పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, సత్తెనపల్లి, క్రోసూరు సీడీపీవోలు టి.శ్రీలత, ఎస్. వెంకట రమణలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐదు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 8 మంది దరఖాస్తు చేసుకొని, ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 13 హెల్పర్ పోస్టులకుగాను 18 మంది దరఖాస్తు చేసుకోగా 16 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాలుగు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు ఏడుగురు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 16 హెల్పర్ పోస్టులకు 16 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## దుండగులను వెంటనే అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న రవిబాబు

**సత్తెనపల్లి:** అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు కలిసి శనివారం నిరసన తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగామ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవిబాబు మాట్లాడారు. దళితులకు, నాయకులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహం కాల్చడం అంటే దళితుల ఆత్మగౌరవం కాల్చినట్టేనని ఆయన మండిపడ్డారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబండి ఆంథోనీ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేవారు. సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షంచాలని కోరారు. బహుజన సమాజ్ పార్టీ నియోజక వర్గ నాయకులు కుక్కమళ్ల దేవానంద్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాల వద్ద పోలీస్‌లు నిఘా నేత్రలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడిరెక్క దేవదాసు, జూపల్లి పాల్, పెద్దింటి నాగేశ్వరరావు, పద్మారావు, నాయకులు మాదంశెట్టి వేదాద్రి, సిద్దిల మోహన్, శేఖర్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తలతోటి కోటేశ్వరరావు, మాలపాటి విజయ్ కుమార్, బండారు రవి, జై బీమ్‌రావు భారత్ పార్టీ నాయకులు జాన్‌బాబు, అంబేడ్కర్ ప్రజా సంఘం నాయకులు దావులూరి కోటేశ్వరరావు, అంబేడ్కర్ యువ జన సంఘం నాయకులు పాల్ రాజ్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుపై అందరికీ అవగాహన అవసరం


మాట్లాడుతున్న హ్యాండ్లూమ్స్ ఏడీ రాఘవరావు

**సత్తెనపల్లి:** జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు తెలిపారు. పట్టణంలోని ఆప్కో షోరూం వద్ద శనివారం జీఎస్టీ తగ్గింపుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించిందని తెలిపారు. యారన్‌పై అంతే ఐదు శాతాన్ని ఉంచిందని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుపై హ్యాండ్లూమ్స్ ఏడీ రాఘవరావు, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ మేనేజర్ బాషా వివరించారు. సమావేశంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్బీకేల ద్వారా యూరియా సరఫరా చేయాలి

**శావల్యాపురం:** సొసైటీల ద్వారా రైతులకు సరిపడా యూరియా బస్తాలు ఇవ్వటం లేదని వైఎస్సార్ సీపీ మండల వైస్ కన్వీనర్ తిరివీధి వెంకట రమణారావు అన్నారు. సొసైటీల్లో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లో ఉంచి కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నట్లు ఆరోపించారు. యూరియా బస్తాలు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేద్దామంటే సుమారు ఒక్కో బస్తా రూ.500 వరకు తీసుకుంటూరన్నారు.10 నుంచి 20 ఎకరాలు సాగు చేసే రైతులకు కూడా కేవలం రెండు యూరియా బస్తాలు ఇస్తే సాగు ఎలా చేయాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందని రైతుకు పూర్తిస్థాయిలో యూరియా అందించటంలో విఫలమైందన్నారు. వ్యవసాయ అధికారులకు సాగు చేసే భూముల గురించి అవగాహన లోపంతో ఈదుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులన్నీ సకాలంలో అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా బస్తాలు సక్రమంగా అందించకపోవటం శోచయనీయన్నారు. ఇప్పటికైనా రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా యూరియా సంచులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు బొల్లా సుబ్బారావు, తిరివీధి శ్రీనివాసరావు, బోడెపూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలి

**7న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా**



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

**చిలకలూరిపేట:** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 7న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని కోరారు. ఈ లోగా మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలన్నారు. రూ. 20 వేల కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. నాలుగు పెండింగ్ డీఏలు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించాలని, యాప్‌లు, జూమ్ మీటింగులు రద్దు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షలు అసెస్‌మెంట్ బుక్ విధానం రద్దు చేయాలన్నారు. మరణించిన ఉపాధ్యాయుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు కారుణ్యనియామకాలు చేపట్టాలన్నారు.

మొత్తం 20 డిమాండ్ల సాధనకై విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల ఏడున నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ధర్నా కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.కోటేశ్వరరావు, బి.సంపత్ బాబు, కె. తిరుపతిస్వామి, వి.అక్కయ్య, పోటు శ్రీనివాసరావు, ఎండీ యాసిన్, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

## జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి

**డాక్టర్ దార్ల బుజ్జిబాబు**


పాఠశాలకు బాలసాహిత్య గ్రంథాలను అందజేస్తున్న డాక్టర్ బుజ్జిబాబు

**నరసరావుపేట:** జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జనవిజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు తెలిపారు. ఎస్ఆర్‌కేటీ ప్రాథమిక పాఠశాలలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం జంతు సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ జంతువులకు కూడా బ్రతికే హక్కు ఉందని వాటిని కాపాడుకోవడం సమాజ బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు జంతు ప్రేమికులుగా మారినప్పుడు పర్యావరణ సమతుల్యతగా ఉంటుందని తెలిపారు. జంతువులను చంపే హక్కు మనకు లేదని అలాగే చంపితే కఠినమైన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మాస్కులు పంపిణీ చేసి జంతుసంరక్షణపై అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన 50 రకాల బాలసాహిత్య గ్రంథాలను బహూకరించారు.

కార్యక్రమంలో గార్ప్ సలహాదారు దాసరి చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయుడు ఎ.గురులింగం, ఉపాధ్యాయులు కొమ్మినేని సుధాకర్, ఫాతిమా రాణి, అపర్ణలు పాల్గొన్నారు.

## ధర్నా విజయవంతం చేయండి

**ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు బేబీరాణి**


మాట్లాడుతున్న బేబీరాణి, ఎస్టీయూ నాయకులు

**రెంటచింతల:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7 విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు బేబీరాణి కోరారు. శనివారం స్థానిక ఎస్టీయూ మండల శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇస్తానని హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయలేదన్నారు. ఇప్పటివరకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం కల్పించలేదన్నారు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసే పనులు తగ్గించాలని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి విజయవాడలో ఈ ధర్నాను చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సమవేశంలో ఎస్టీయూ సంఘ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఖుద్దుస్, సంఘం నాయకులు లేళ్ల శ్రీనివాసరావు, వెంకటేష్, భీముడు నాయక్, శ్రీను నాయక్, సిలార్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్త్యాలరాజా జయంతి వేడుకలు



**విజయపురిసౌత్:** శ్రీ రాజా వాసిరెడ్డి రామ గోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాలరాజా) 108వ జయంతి వేడుకలను శనివారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ముక్త్యాలరాజా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం వెంకటరమణ మాట్లాడుతూ ముక్త్యాల రాజా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి మూల పురుషుడు అని కొనియాడారు. ఆయన కృషి లేకపోతే సాగర్ ప్రాజెక్టు సాధ్యం అయ్యేది కాదన్నారు. ఆనాడు భోస్లా కమీటికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేసి ప్రాజెక్టు రూపకల్పనలో ముక్త్యాల రాజా చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.